క్లుప్తంగా

మినీ బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయికల్: పట్టణంలోని కొమురం భీం చౌరస్తాలో మినీ బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహేందర్ బాబు ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత



సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

మెట్‌పల్లి: వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యతేనని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణంలోని ఖాదీ ప్రతిష్టాన్‌లో ఉన్న హనుమాన్ ఆలయంలో ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25 తల్లిదండ్రుల జంటలను సన్మానించారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు కష్టపడడమే కాకుండా ఎన్నో త్యాగాలు చేస్తారన్నారు. అలాంటి వారిని వృద్ధాప్యంలో విస్మరించడం తగదన్నారు. కార్యక్రమంలో ఇల్లెందుల శ్రీనివాస్, మర్రి భాస్కర్, వేములవాడ పురుషోత్తం, దొంతుల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ అవగాహన సదస్సు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని సినారే కళాభవన్‌లో ఆగస్టు 10 న భారత రాజ్యాంగం దాని పూర్వపరాలు అనే అంశంపై నిర్వహించే జిల్లా స్థాయి సదస్సును విజయవంతం చేయాలని వామపక్ష, పూలే అంబేడ్కర్,మైనారిటీ,ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సి. ప్రభాకర్ భవన్‌లో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. భారత రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు జిల్లాలోని రైతులు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెన్నా విశ్వనాథం, పేట భాస్కర్, సుతారి రాములు, చింతా భూమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

రాయికల్: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన పెగ్గర్ల శ్రీధర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి ఆదివారం మృతుడి స్నేహితులు కలసి తలా కొంత జమ చేసి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వీరిని గ్రామస్తులు అభినందించారు.

గల్ఫ్ కార్మికుడికి కాంగ్రెస్ నాయకులు..

ధర్మపురి: బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లి ప్రమాదశాత్తు గాయపడి ఓ గల్ఫ్ కార్మికుడికి కాంగ్రెస్ నాయకులు ఆర్థికసాయం అందించారు. మండలంలోని నేరెల్ల గ్రామానికి చెందిన ఎలిగేటి నాగరాజు అనే యువకుడు దుబాయిలో ప్రమాదవశాత్తు కింద పడిపోగా, కాళ్ల చేతులు విరిగి స్వగ్రామం చేరుకున్నాడు. ఆదివారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కాసారపు బాలాగౌడ్, జాజాల రమేశ్, కాంగ్రెస్ నాయకులు రూ.20,500 నగదు, 25 కిలోల బియ్యం నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, మామిడిపెల్లి గోపాల్, ఇంద్రాల మల్లేశం తదితరులున్నారు.

జోరుగా నకిలీ దందా

- మోసపోతున్న ప్రజలు
- ఇతర రాష్ట్రాల వ్యాపారుల ఇష్టారాజ్యం
- కిరాణం, ఎలక్ట్రికల్, ఆహారపదార్థాల్లో అత్యధికంగా నకిలీమయం
- కానరాని తనిఖీలు?



నకిలీ పైపులను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

జగిత్యాల: కల్తీకి కాదేది అనర్హం అన్న చందంగా తయారైంది జగిత్యాల జిల్లాలో పరిస్థితి.. జిల్లా లో చాలా చోట్ల కల్తీ రాజ్యమేలుతోంది. కిరాణం సామగ్రి మొదలు ఎలక్ట్రికల్, ఆహారపదార్థాలు అన్నీ కల్తీ అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని టవర్‌సర్కిల్‌లో ఓ ఎలక్ట్రికల్ షాపు ఉంది. ఇక్కడ అత్యధిక మంది ఎలక్ట్రికల్ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. జగిత్యాలకు చెందిన ఒక వ్యక్తి సుమారు రూ.4 లక్షల విలువ చేసే పైపులు కొనుగోలు చేశాడు. అందులో కొన్ని డూప్లికేట్ రావడంతో ఆ ఇంట్లో పనిచేస్తున్న ఎలక్ట్రికల్ వర్కర్స్ గుర్తించారు. సదరు వ్యక్తి మళ్లీ ఆ షాపునకు తీసుకెళ్తే ఇవి నావి కావని, ఎక్కడి నుంచో తెచ్చి నా వద్దకు తెస్తున్నావంటూ బుకాయించారు. నేను లాట్‌గా కొన్నానని, నేను ఎక్కడి నుంచి తేలేదని సదరు వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సైతం ఇలాంటి ఎలక్ట్రికల్ షాపు, ప్లంబర్, కిరాణం షాపుల్లో అత్యధికంగా డూప్లికేట్ వస్తువులు పట్టుబడగా కేసులు సైతం నమోదయ్యాయి. ఇలా జిల్లా కేంద్రంలో కొందరు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడ్డ వ్యాపారులు ఆ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. పోలీసులకు సైతం అత్యధికంగా ఫిర్యాదులు చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి.

ప్రస్తుతం అన్ని వస్తువుల్లో నకిలీవే ఉంటున్నాయి. ముఖ్యంగా బియ్యం, పప్పు, ఉప్పు, నూనెల్లో అత్యధికంగా కల్తీ జరుగుతుంటాయి. అయితే ప్రస్తుతం ఇవేకాకుండా ఇంటి నిర్మాణానికి వాడే పైపులు, ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్‌బోర్డులు, అలాగే సాధారణంగా వినియోగించే ఫెవిక్విక్‌లు, పెన్సిల్స్, శానిటరీకి సంబంధించిన వస్తువులు మార్కెట్‌లో నకిలీవి విరివిగా అమ్ముతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆటగా మారింది. ఇతర రాష్ట్రాల నుంచి స్థిరపడ్డ కొందరు వ్యాపారులు నకిలీ వస్తువులను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇవి ఎక్కువగా ఇటీవల శానిటరీ, కిరాణం, సూపర్‌మార్కెట్లలో షాపుల్లో ఇవి అత్యధికంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో సైతం టవర్‌సర్కిల్‌లో ఓ హోల్‌సేల్ షాపులో ఓ ప్రముఖ కంపెనీకి చెందిన చాయిపత్తి ప్యాకెట్లు సైతం విక్రయించగా ఆ కంపెనీకి చెందిన వారు గుర్తించి పోలీసులకు పట్టించగా, అలగే ఓ శానిటరీ షాపుతో పాటు, ఎలక్ట్రికల్ షాపుల్లో నకిలీలు అమ్ముతున్నారని గుర్తించిన ఒరిజినల్ డిస్ట్రిబ్యూషన్ చేసే కంపెనీల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇవి వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా కంపెనీ లాంటి బ్రాండ్‌లతోనే వీటిని సైతం ముద్రించి అలాగే విక్రయిస్తున్నారు. ఇవి ప్రస్తుతం నిర్మాణరంగంలో వీటిని ఎక్కువగా వినియోగిస్తుంటారు.

శానిటేషన్, ఎలక్ట్రికల్ వస్తువులే ఎక్కువ

జిల్లా కేంద్రంలో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టుకునే వారికి శానిటరీ, ఎలక్ట్రికల్ వస్తువులు ఖచ్చితంగా అవసరముంటాయి. కొనుగోలు చేసుకునే యజమానులు నకిలీ ఏవో, అసలివి ఏవో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో నకిలీ ఓ కంపెనీకి చెందిన పైపులు, ఎంసిల్స్, పట్టుబడగా పోలీసులు సైతం కేసునమోదు చేశారు. మళ్లీ టవర్ వద్ద గల ఓ షాపులో నకిలీ పైపులు ఇచ్చారని బాధితుడు షాపు ఎదుట ఆందోళన సైతం చేశాడు. నకిలీ పైపుల కలకలం జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. డిస్కౌంట్‌ల పేరుతో ఆఫర్లు చూపుతూ కొందరు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తూ నకిలీ వస్తువులను అంటగడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పకడ్బందీ నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అంతే కాక సంబంధిత ఒరిజినల్ కంపెనీలు నిర్వాహకులు సైతం తమ వాటితో పోలిన వస్తువులను విక్రయిస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ప్రతీది గమనించి కంపెనీవా కాదా అని కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు. తినుబండారాలకు సంబంధించినవి అనారోగ్యం పాలు కాగా, నకిలీ వస్తువులేమో నూతనంగా నిర్మించుకున్న ఇళ్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏదేమైనా నాణ్యత లేని ఆహారపదార్థాలు, నకిలీ వస్తువులను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

అంబేడ్కర్ అందరివాడు



నివాళి అర్పిస్తున్న బల్దియా కమిషనర్ స్పందన

జగిత్యాలటౌన్: భారతదేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించి అణగారిన వర్గాలకు స్వేచ్ఛావాయువులు ప్రసాదించిన డాక్టర్, బీఆర్ అంబేడ్కర్‌ను ఏ ఒక్క వర్గానికి పరిమితం చేయడం సరికాదని, ఆయన అందరివాడని బల్దియా కమిషనర్ స్పందన అన్నారు. ఆదివారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగడమే ఆ మహనీయునికి మనమిచ్చే అసలైన నివాళి అని చెప్పారు. అంబేడ్కర్ జీవితంలో ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలు, వివక్షత నుంచి ప్రతీ వ్యక్తి స్ఫూర్తి పొందాలని సూచించారు. కార్యక్రమంలో డిక్కీ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, మద్దెల నారాయణ, అనంతుల కాంతారావు, జవ్వాజి శంకర్, అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత



మృతి చెందిన గొర్రెలు

మేడిపల్లి: గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 18 గొర్రెలు మృతి చెందిన ఘటన మేడిపల్లి మండలంలోని దమ్మన్నపేటలో ఆదివారం చోటుచేసుకుంది. మామిడి శంకర్‌కు చెందిన 18 గొర్లను శనివారం మేతకు తీసుకెళ్లి రాత్రిపూట దొడ్లో వదిలేసి ఇంటికెళ్లాడు. ఆదివారం పొద్దున వచ్చి చూసే వరకు 18 గొర్లు చచ్చిపడి ఉన్నాయని కన్నీరు పెట్టుకున్నాడు. చనిపోయిన గొర్ల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎం రాంరెడ్డిని సన్మానిస్తున్న డీఈవో రాము

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఎన్నం రాంరెడ్డి అంకిత భావంతో పనిచేసాడని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి ఈ నెల 31 న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా జరిగిన అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, అతడు విధుల్లో ఉన్న సమయంలో చేసిన సేవలు ఎప్పుడు ప్రజల మదిలో ఉంటాయన్నారు. ఇప్పటి నుంచి రాంరెడ్డి సామాజిక సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రాంరెడ్డిని అభినందించి వెళ్లారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి, నారయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసి పనిచేయాలి



పోతారంలో బీఆర్ఎస్ నాయకుల సమావేశం

సారంగాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎవరికి బీ ఫాం ఇచ్చినా అభ్యర్థి విజయానికి కలిసి పనిచేయాలని పార్టీ నాయకులు సూచించారు. ఆదివారం మండలంలోని పోతారంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ రిజర్వేషన్ల ఆధారంగా ఏ అభ్యర్థిని ప్రకటించినా వారి గెలుపుకు కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తేలు రాజు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, మాజీ సర్పంచ్‌లు పునుగోటి విజయరంగారావు, ఖైరి మల్లేశం, గుర్రం స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలు, మెమొంటోలతో విద్యార్థులు

మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం: పాండిచ్చేరిలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మెట్‌పల్లిలోని అవినాష్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు, ఇబ్రహీంపట్నంకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. కటాస్, స్పారింగ్ విభాగాల్లో కౌశిక్, ప్రశాంతి మొదటి స్థానంలో..హరి, సాహు, అనన్యలు ద్వితీయ స్థానంలో, అండర్ -21 విభాగంలో కుంట మధుశాలిని ప్రథమ స్థానం, అండర్ 12 విభాగంలో దండిక వికాస్ యాదవ్ తృతీయ స్థానంలో నిలిచినట్లు మాస్టర్ అవినాష్ తెలిపారు. అనంతరం నిర్వాహకులు వారికి మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ రజిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో 5 సీట్లు, ఇంటర్ సీఈసీలో 7 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లో 2 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. సోమవారం దరఖాస్తు చేసుకుంటే స్పాట్ అడ్మిషన్ ఉంటుందని తెలిపారు.

రోడ్డంతా బురదమయం...



భూషణరావుపేట శివారులో బురద రోడ్డు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామం నుంచి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు ఇటీవలే కురిసిన వర్షానికి బురదమయంగా మారడంతో రాకపోలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ బురద రోడ్డు నుంచి బైకులు, ఆటోలు వెళ్లితే అదుపు తప్పుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రెండు జిల్లాలను కలిపే రోడ్డు అధ్వానంగా ఉన్నప్పటికీ రోడ్ల భవనాలశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్‌లో 1999–2000లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల పునఃప్రారంభం కోసం తమ వంతు కృషి చేస్తామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చక్రధర్ రామాచారి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



కొడిమ్యాల: మండలంలోని నాచుపల్లి కురుమవాడలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డున వెళ్లే ద్విచక్ర వాహనదారులు జారి కింద పడుతున్నారు. ఆ రోడ్డున కాలి నడకన వెళ్లే గ్రామస్తులు కూడా తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. అధికారులు జోక్యం చేసుకోని రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఏ.శేఖర్, పంచాయతీ కార్యదర్శి, నాచుపల్లి, సెల్ నంబర్ : 9676138013

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న నర్సింగరావు

మెట్‌పల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకపోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నర్సింగరావు జెండా ఆవిష్కరించారు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షులు నాయిని సురేష్‌గౌడ్‌తో పాటు నాయకులు జెట్టి లింగం, అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ఆకుల లింగారెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలీలకు అండగా ఉంటాం

ఇబ్రహీంపట్నం: పద్మశాలీలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని మార్కండేయ మందిరంలో నిర్వహించిన పద్మశాలీ ఐక్యత సభలో పాల్గొని మాట్లాడారు. పద్మశాలీలకు నామినేట్ పోస్టుల్లో అవకాశం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందేనని అన్నారు. గత పదేళ్లలో ప్రభుత్వంలో ఒక్కరికి కూడ రేషన్ కార్డు ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు చాట్ల గణేష్, గౌరవ అధ్యక్షుడు నందగిరి ప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బూస రాజేశ్వర్, నాయకులు జెట్టి లింగం, తదితరులు పాల్గొన్నారు.

రూ.5 భోజనం ఎన్నికల స్టంట్



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో పేదల కోసం ప్రారంభించిన రూ. 5 భోజనం ఏమైందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రశ్నించారు. పట్టణంలో ఆదివారం జువ్వాడి భవన్‌లో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్‌లు రూ. 5 కే భోజనం ఆర్భాటంగా ప్రారంభించి, ఎన్నికల తర్వాత మూసేశారన్నారు. ఇది ఎన్నికల స్టంటేనని, దీనికి ఎమ్మెల్యే సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పి ఇప్పుడు నెలలో 3 వారాలు హైదరాబాద్‌లో, కేవలం ఒక్క వారం మాత్రమే ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేసే స్థాయి ఎమ్మెల్యే సంజయ్‌కు లేదన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, వేంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎతిరాజం సర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కారు రెంటల్ కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి కార్ రెంటల్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అడువాల రాజు, ఉపాధ్యక్షులుగా కాసర్ల నరేష్, రాందేని మారుతి, కోశాధికారిగా చెప్యాల విజయ్, ప్రధాన కార్యదర్శులుగా అయ్యోరి ప్రసాద్, పుట్టపాక శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా గోసుకుల రాజశేఖర్, ముఖ్య సలహాదారులు, కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.

మెట్‌పల్లి క్లబ్ స్థలం రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

మెట్‌పల్లి: పట్టణంలోని మెట్‌పల్లి క్లబ్‌కు చెందిన స్థల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మారుతి ఆదివారం డిమాండ్ చేశారు. ఆ స్థలంలో ఎంపీ నిధులతో నిర్మించిన భవనాలను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారన్నారు. ఆ తర్వాత స్థలాన్ని విక్రయించారని, ఉన్నతాధికారులు వీటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

లోలెవల్ కల్వర్టుతో ఇబ్బందులు



పెగడపల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న లోలెవల్ కల్వర్టుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరద ఉధృతికి వాహనాల రాకపోకలు సాగడం లేదు. ఇక్కడ లోలెవల్ కల్వర్టు వద్ద హైలెవల్ కల్వర్టు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరు చేసింది. టెండర్ పొందిన కాంట్రాక్టర్ వేరొకరికి పనులు అప్పగించాడు. మూడేళ్లయిన పనులు ప్రారంభించక పోయినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైలెవల్ కల్వర్టు నిర్మించి ప్రయాణికుల అవస్థలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.